@netifocusnews @focustv
http://epaper.netifocusnews.com
www.netifocusnews.com
TS-18-0006625

FOCUS TELUGU TV
అనునిత్యం - ప్రజాపక్షం

నేటి ఫోకస్ న్యూస్
అను నిత్యం...ప్రజా పక్షం...
తెలుగు డిజిటల్ దినపత్రిక

ఎడిటర్: యం.తరుణ్ || తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రజల కోసం మా ఈ నేటి ఫోకస్ న్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రిక || హైదరాబాద్ || శుక్రవారం 16, ఆగస్ట్ 2024 || పేజీలు: 04



వైరా/కొత్తగూడెం, (నేటి ఫోకస్‌న్యూస్)-ఆగస్ట్ 15:

'రుణ మాఫీతో తెలంగాణలో రైతులు రుణ విముక్తులై స్వేచ్ఛా వాయువులు పీలుస్తున్నారు. లోక్‌సభ ఎన్నికల సమయంలో ఖమ్మం జిల్లా గడ్డపై నుంచి ఆగస్టు 15 నాటికి రూ.2 లక్షల రుణమాఫీ చేసి చూపుతామని మేం చెబితే.. చేయలేరని మాజీ మంత్రి హరీశ్‌రావు సవాల్ చేసిండు. మేము మాట నిలబెట్టుకుంటే రాజీనామా చేస్తానని చెప్పిండు. ఇప్పుడు మేం పూర్తిగా మాఫీ చేశాం.. వెంటనే హరీశ్ రాజీనామా చేయాలి' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. సిగ్గు, శరం లేకుండా విమర్శలు చేస్తున్న హరీశ్.. చీము, నెత్తురు ఉంటే రాజీనామా చేయాలన్నారు. సిద్దిపేటలో మళ్లీ ఎలా గెలుస్తాడో చూస్తామన్నారు. మిగతా 2లో..



# రైతు రుణమాఫీ చేసి చూపించాం..

## రూ.2లక్షల హామీ నెరవేర్చాం.. సిగ్గుంటే హరీశ్‌రావు రాజీనామా చెయ్..

- ప్రాజెక్టులపై ఎక్కడైనా చర్చకు మేం సిద్ధం.. మరి మీరు?
- కేసీఆర్, కేటీఆర్ , హరీశ్‌లలో ఎవరొస్తారు?
- గోదావరి, కృష్ణా నీళ్లతో రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేస్తాం
- 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని త్వరలో ప్రారంభిస్తాం
- ప్రజలు అండగా నిలిస్తే బీఆర్ఎస్, బీజేపీని బొందపెడతాం
- ఖమ్మం జిల్లా వైరా బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి
- భద్రాద్రి జిల్లా పూసుగూడెంలో సీతారామ ప్రారంభం
- పాల్గొన్న భట్టి విక్రమార్క, తుమ్మల, ఉత్తమ్, పొంగులేటి



## ఫ్యూచర్ స్టేట్‌గా తెలంగాణ

### విశ్వవేదికపై తెలంగాణ బ్రాండ్

- రైతు కూలీలకు త్వరలో 12 వేలు
- గోల్కొండలో స్వాంతంత్ర్య వేడుకల్లో సీఎం రేవంత్‌రెడ్డి
- రాష్ట్రానికి రూ.31,532 కోట్ల పెట్టుబడులు
- 30 వేల మందికి ఉద్యోగాలు
- దశాబ్దకాలం తర్వాత తెలంగాణకు స్వేచ్ఛ
- ఏడో గ్యారెంటీగా రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరిస్తున్నాం
- రైతు కూలీలకు త్వరలో 12 వేల సాయం
- గోల్కొండలో స్వాతంత్ర్య వేడుకల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

వివరాలు 02లో..

## హామీలు నెరవేర్చకపోతే కాంగ్రెస్‌కు చుక్కలే!

- స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఉప ఎన్నిక ఖాయం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)-ఆగస్ట్ 15:

రైతుబంధు ఎగ్గొట్టి రుణమాఫీ అని బిల్డప్ ఇచ్చారంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శలు గుప్పించారు. ఆగస్ట్ 15వ తేదీ వచ్చినా రూ. 2 లక్షల రుణమాఫీ కాలేదని... అందుకే తెలంగాణకు రావాలని పిలుస్తున్నా రాహుల్ గాంధీ రావడం లేదని మిగతా 2లో..






## స్కిల్స్ యూనివర్సిటీ చైర్మన్‌గా ఆనంద్ మహీంద్రా

- ఉత్తర్వులు జారీ చేసిన తెలంగాణ ప్రభుత్వం

హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)-ఆగస్ట్ 15:

తెలంగాణ యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ చైర్‌పర్సన్‌గా ప్రముఖ పారిశ్రామిక వేత్త, మహీంద్రా గ్రూపు సంస్థల చైర్మన్ ఆనంద్ మహీంద్రా నియమితులయ్యారు. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆటోమొబైల్, ఏయిరోస్పేస్, మిగతా 2లో..

## మీ రుణమాఫీ పచ్చి అబద్ధం!

- రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి స్థాయికి తగినట్లుగా మాట్లాడటం లేదు
- మీరు దగా చేస్తే.. రాజీనామా ఎవరు చేయాలి?
- ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు



వివరాలు 02లో..

## దేశానికి లౌకిక పౌరస్మృతి అవసరం..

- రాజ్యాంగ కర్తల నుంచి సుప్రీంకోర్టు వరకు 78ఏళ్లుగా కోరుతున్నదిదే..
- ఇప్పటి మతపర సివిల్ కోడ్‌ను మార్చాలి
- 'ఒక దేశం-ఒకే ఎన్నికలు' నేటి అవసరం
- 78వ స్వాతంత్ర్య దినోత్సవ సందేశంలో ప్రధాని నరేంద్ర మోదీ



న్యూఢిల్లీ, (నేటి ఫోకస్‌న్యూస్)-ఆగస్ట్ 15:

దేశానికి లౌకిక పౌరస్మృతి అవసరమని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఉద్ఘాటించారు. ఇప్పుడున్న సివిల్ కోడ్ మతపరమైనదీ, విపక్షాపూరితమైందని ఆక్షేపించారు. దీనిపై విస్తృతస్థాయిలో చర్చ జరగాలని మోదీ అభిప్రాయపడ్డారు. 78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గురువారం దేశ రాజధానిలోని ఎర్రకోట బురుజుపై జాతీయ జెండాను ఎగురవేసి, ప్రధాని ప్రసంగించారు. కాషాయం, ఆకు పచ్చ, పసుపు కలగలిసిన రాజస్థానీ (లెహెరియా) మిగతా 2లో..

### ప్రధాని మోదీ మరో రికార్డు

- అత్యధికంగా 96 నిముషాల పాటు ప్రసంగం 2

### యూనిఫామ్ సివిల్ కోడ్ ఆవశ్యకత ఉంది

- మరోమారు ఎర్రకోట వేదికగా ప్రధాని ప్రస్తావన.. 2



# రైతు రుణమాఫీ చేసి చూపించాం..

(మొదటి పేజీ తరువాయి..)

రాజీనామా చేయకపోతే ఏట్లో దూకాలని.. అప్పుడు సిద్దిపేటకు పట్టిన చీడ, పీడ వదులుతుందని రేవంత్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్, బీజేపీలను బొందపెట్టడం ఖాయమని.. ఆ సంగతి తాను చూసుకుంటానని, ప్రభుత్వానికి అండగా నిలవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సీతారామ పంప్‌హౌజ్ మోటార్ల ప్రారంభోత్సవం సందర్భంగా ఖమ్మం జిల్లా వైరాలో గురువారం 'సాగుకు జీవం.. రైతుకు ఊతం' బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అంతకుముందు భద్రాద్రి జిల్లా పూసుగూడెంలో సీతారామ పంప్‌హౌజ్‌ను ఆయన ప్రారంభించారు. వైరాలో మాట్లాడుతూ.. ఈ సభలో మొత్తం 2 లక్షలలోపు రుణాలున్న రైతులకు రూ.31 వేల కోట్లు మాఫీ చేసినట్లు ప్రకటించారు. కృష్ణా, గోదావరి జలాలతో రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేస్తామని ప్రకటించారు. సీతారామ ప్రాజెక్టుకు ఎన్ని వేల కోట్లయినా ఖర్చుపెట్టి 2026 ఆగస్టు 15 నాటికి పూర్తి ఆయకట్టుకు నీరందిస్తామని చెప్పారు. డబుల్ బెడ్ రూం ఇళ్ల పేరుతో గత ప్రభుత్వం మోసం చేసిందని, తాము అసెంబ్లీ నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నామని, 4.5 లక్షల ఇళ్ల నిర్మాణాన్ని త్వరలోనే ప్రారంభిస్తామని చెప్పారు. బీఆర్ఎస్ పాలన, కాంగ్రెస్ పాలనలో సాగునీటి ప్రాజెక్టులు, వ్యయాలపై బహిరంగ చర్చకు సిద్ధంగా ఉన్నామని, డిప్యూటీ సీఎం భట్టి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ వస్తారని, బీఆర్ఎస్ నుంచి కేసీఆర్, బిల్లా-రంగాల్లో ఎవరు వస్తారో తేల్చుకోవాలని సవాల్ చేశారు. ఏ చౌరస్తాలోనైనా, ఏ సెంటర్‌లోనైనా చర్చకు సిద్ధమని పేర్కొన్నారు. జూలై 18 నుంచి కేవలం 27 రోజుల్లో రూ.18 వేల కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేశామని.. ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ 8 నెలల్లోనే నెరవేర్చామని వివరించారు. "బీజేపీని 8 లోక్‌సభ స్థానాల్లో గెలిపిస్తే కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు గాడిద గుడ్డు ఇచ్చింది. ఆ పార్టీని కూడా ప్రజలు బొంద పెట్టడం ఖాయం. కేసీఆర్‌కు దడవం. మోదీకి బెదరం. ఖమ్మం జిల్లాలో రైతులకు బేడీలేసి జైలుకు పంపిన, చంటి బిడ్డల తల్లులపై కర్కశంగా పోలీసులతో దాడులు చేయించిన చరిత్ర బీఆర్ఎసది. ఖమ్మం జిల్లాకు గోదావరి జలాలను అందించేందుకు రూ.18 వేల కోట్లతో సీతారామ ప్రాజెక్టుకు రూపకల్పన చేస్తే రూ8 వేల కోట్లు ఖర్చు చేసినా ఒక్క ఎకరానికి కూడా నీరందించలేకపోయారు. మేం 2026 ఆగస్టు 15 నాటికి పూర్తిచేసి 7 లక్షల ఎకరాలకు నీరందిస్తాం. నెల జీతాలు చెల్లించలేని దుస్థితి నుంచి రాష్ట్రాన్ని గట్టెక్కించాం. 90 రోజుల్లో 30 వేల ఉద్యోగాలు కల్పించాం. డీఎస్సీ ద్వారా 11 వేల ఉద్యోగాలను భర్తీ చేస్తున్నాం. గ్రూప్-1, 2, 3, ఇతర నియామకాల ద్వారా ఈ ఏడాది 65 వేల ఉద్యోగాలు కల్పించబోతున్నాం" అని రేవంత్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ వదిలేసిన ప్రాజెక్టులను పూర్తి చేస్తున్న తమను హరీశ్ అభినందించకపోయినా ఫర్లేదని.. అవమానించేలా మాట్లాడొద్దని సీఎం సూచించారు. ప్రాజెక్టులను 80, 60, 40, 20 శాతం పూర్తయినవిగా గుర్తించి ప్రాధాన్య క్రమంలో పూర్తి చేస్తున్నామని తెలిపారు. తాము ఇక్కడికి నీళ్లు చల్లుకోవడానికి రాలేదని, గోదావరి తల్లే తమను నీటితో తడుపుతోందని అన్నారు. హరీశ్ అవసరమైతే సీతారామ జలాలను చల్లుకోవాలని సూచించారు. రాలేకపోతే రెండు సీసాల్లో కేసీఆర్, హరీశ్‌కు పంపాలని మంత్రి తుమ్మలకు సూచించారు. ఆ నీటిని ఎలా కలుకొపుంటారో వారికి తెలుసునని ఎద్దేవా చేశారు. సీతారామలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 40 శాతం పనులే జరిగాయని, ఎకరానికి కూడా నీరు ఇవ్వలేదన్నారు. రూ.10 వేల కోట్ల పని ఉండగా 90 శాతం పనులు పూర్తయినట్లు ఎలా చెబుతున్నారని హరీశ్‌ను సీఎం ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఏనాడూ నీళ్ల కోసం రోడ్డెక్కని మాజీ ఎమ్మెల్యేలు రేగా కాంతారావు, హరిప్రియలు ఇప్పుడు ధర్నాలు చేయడం చూస్తుంటే తమ ప్రభుత్వం తప్పకుండా నీళ్లిస్తుందనే నమ్మకం ప్రజల్లో కలుగుతుందన్నారు.

### సాగర్ రాకపోయినా ఖమ్మం రైతులకు ఇబ్బంది ఉండదు

రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను కేసీఆర్ కుటుంబం ఆగం చేసిందని, ప్రాజెక్టుల రీ డిజైన్ పేరుతో కమీషన్లు దండుకున్నారని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. ఈ బాగోతం బయటపడుతుందనే సీతారామకు డీపీఆర్ ఇవ్వలేదన్నారు. భద్రాద్రి జిల్లా ములకలపల్లి మండలం పూసుగూడెంలో సీతారామ ఎత్తిపోతల పంప్‌హౌజ్ స్విచాన్ చేసి నీటిని విడుదల చేశారు. మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమక్షంలో పైలాన్‌ను ఆవిష్కరించి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నాగార్జున సాగర్ నీరు రాకపోయినా ఖమ్మం జిల్లా ఆయకట్టుకు ఇబ్బంది లేకుండా గోదావరి జలాలను వైరా జలాశయానికి అనుసంధానం చేశామన్నారు. ఏన్కూర్ లింక్ కెనాల్ పనులను డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు తుమ్మల, పొంగులేటి, ఉత్తమ్ యుద్ధప్రాతిపధిక పూర్తి చేయించారని ప్రశంసించారు. కేసీఆర్ ప్రాజెక్టులకు రూ.1.80 లక్షల కోట్లు ఖర్చు పెట్టినా ఉమ్మడి ఖమ్మం జిల్లాకు మాత్రం నీళ్లు ఇవ్వలేకపోయారన్నారు. నాలుగేళ్లుగా పంపుహౌసకు విద్యుత్ కనెక్షన్ ఇవ్వలేదన్నారు. కేసీఆర్, హరీశ్ బోగస్ మాటలు చెప్తారు కాబట్టే ఆ పార్టీ నేతలు నీళ్ల కోసం ఆందోళన చేయలేదని ఎద్దేవా చేశారు.

### మానస పుత్రిక అంటూ సవతి ప్రేమ చూపారు: భట్టి

సీతారామ ప్రాజెక్టును మానసపుత్రికగా చెప్పుకొంటున్న కేటీఆర్, హరీశ్‌రావులు దశాబ్ద కాలంలో చుక్క నీరు కూడా అందించలేదని ఉప ముఖ్యమంత్రి భట్టి విమర్శించారు. బీఆర్ఎస్ పాలనలో సీతారామ, కాళేశ్వరం ప్రాజెక్టుల్లో రూ.వేల కోట్ల అవినీతి, అక్రమాలు జరిగాయని, ఉత్తమ్‌తో కలిసి చర్చకు వస్తానని, కేసీఆర్, హరీశ్ సిద్ధంగా ఉన్నారా? అని వైరా సభలో సవాల్ విసిరారు. వైఎస్ శంకుస్థాపనలు చేసిన ఇందిరా, రాజీవ్ సాగర్‌ల డిజైన్లు మార్చి మొత్తం ప్రాజెక్టునే కనుమరుగు చేశారని ఆరోపించారు. రూ.22 వేల కోట్లు దోపిడీ చేసేందుకు.. రైతాంగాన్ని మోసం చేశారని మండిపడ్డారు. ఆరోపించారు.

### చరిత్ర ఎరుగని రుణమాఫీ ఇది: తుమ్మల

మంత్రి తుమ్మల మాట్లాడుతూ దేశ చరిత్రలో ఏ రాష్ట్ర ప్రభుత్వం ఒకే పంట కాలంలో నెల వ్యవధిలో ప్రతి రైతుకు రూ.2 లక్షల రుణ మాఫీ చేసిన చరిత్ర లేదన్నారు. ఎన్నో ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా రేవంత్, భట్టి పట్టుబట్టి మాఫీ చేసి చూపించారని కొనియాడారు. రూ.2 లక్షలకు పైగా రుణాలున్న రైతులు అదనంగా ఉన్న డబ్బు చెల్లించిన వెంటనే వారికి రుణమాఫీ జరుగుతుందన్నారు. సీతారామ ద్వారా కృష్ణా జలాతో గోదావరి జలాలను అనుసంధానం చేయడం ఖమ్మం జిల్లా రైతుల అదృష్టమని పేర్కొన్నారు. సీతారామను నాలుగు నెలల్లోనే పూర్తి చేయడం కోసం రూ.600 కోట్లు కేటాయించి జలయజ్ఞమే నిర్వహించామన్నారు.

### సీతారామ ప్రారంభోత్సవం నా అదృష్టం: ఉత్తమ్

సీతారామ ద్వారా ఖమ్మంను సస్యశ్యామలం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేసిందని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. పంప్ హౌజ్ ప్రారంభంలో పాల్గొనడం తన అదృష్టం అభివర్ణించారు. వచ్చే ఏడాదికి ఖమ్మంలో 7 లక్షల ఎరాలకు నీరిస్తామని చెప్పారు. రుణ మాఫీ ఘనత దేశ చరిత్రలో లిచిపోతుందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.లక్ష మాఫీ ప్రకటించి ఐదేళ్లు సాగదీసి రైతులను మోసం చేసిందని విమర్శించారు.

# ఫ్యూచర్ స్టేట్‌గా తెలంగాణ..

**హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)-ఆగస్ట్ 15:** రానున్న రోజుల్లో తెలంగాణను 'ఫ్యూచర్ స్టేట్'గా మార్చనున్నామని, అందుకు కార్యాచరణ ప్రారంభమైందని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా విదేశీ పెట్టుబడుల సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకున్నామని తెలిపారు. అనేక పోరాటాల ఫలితంగా సాధించుకున్న తెలంగాణలో దశాబ్ద కాలం తర్వాత నిజమైన ప్రజా పాలన మొదలైందన్నారు. బ్రిటీషువారి దాస్య శృంఖలాల నుంచి దేశం ఏవిధంగా విముక్తి చెందిందో... అదే స్ఫూర్తి, అదే పోరాట పటిమతో అంతిమ పోరాటం చేసి 2023 డిసెంబరు 3న తెలంగాణ స్వేచ్ఛ పొందిందని, రాష్ట్రంలో తొలిసారి ప్రజాస్వామ్యబద్ధ పాలన సాగుతోందన్నారు. తమ నిర్ణయాల్లో తప్పు జరిగితే సరిదిద్దుకుంటున్నామని, ఎవరైనా తప్పుడు ఆరోపణలు చేసినా సంయమనాన్ని పాటిస్తున్నాం అని చెప్పారు. ఎన్నికల్లో చెప్పినట్లుగా ఏడో గ్యారెంటీగా ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరిస్తున్నాం అని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో గురువారం గోల్కొండ కోటలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం 10 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి గోల్కొండ కోటపై మువ్వన్నెల పతాకాన్ని ఆవిష్కరించారు. జెండా ఎగురవేశాక జాతీయ గీతాలాపన అనంతరం కొత్తగా స్వరపర్చిన జయ జయహే తెలంగాణ గీతాలపన ఆహూతులను అలరించింది. పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించిన అనంతరం రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి రేవంత్ ప్రసంగించారు. "తెలంగాణ బ్రాండ్‌ను విశ్వవేదికపై సగర్వంగా చాటాలనే లక్ష్యంతో నేను, మంత్రి శ్రీధర్‌బాబు అమెరికాలో పర్యటించి, అంతర్జాతీయ దిగ్గజ సంస్థల అధినేతలు, ప్రతినిధులతో భేటీ అయ్యాం. తెలంగాణలో పెట్టుబడుల అవకాశాలను వివరించాం. ఫ్యూచర్ స్టేట్‌గా తెలంగాణను పరిచయం చేశాం. బేగరికంచె వద్ద శంకుస్థాపన చేసుకున్న ఫోర్త్ సిటీ, మూసీ రివర్ ఫ్రంట్, రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణం, అంతర్జాతీయ మౌలిక సదుపాయాలు, మెట్రో విస్తరణ తదితర ఆలోచనలను వారితో పంచుకున్నాం. జనవరిలో దావోస్ పర్యటనలో భాగంగా రూ.40 వేల కోట్ల పెట్టుబడులకు సంబంధించి ఒప్పందాలు కుదుర్చుకున్నాం. ఇది పెట్టుబడుల ఆకర్షణలో ఒక రికార్డు" అని వివరించారు. రాష్ట్రానికి పెట్టుబడుల సాధన కోసం ఇటీవల చేపట్టిన అమెరికా, దక్షిణ కొరియా పర్యటన విజయవంతమైందని, 19 అగ్రశ్రేణి కంపెనీలతో చర్చలు జరిపామని, రూ.31,532 కోట్ల పెట్టుబడుల ఒప్పందాలు జరిగాయని, తద్వారా 30 వేల మందికి పైగా నేరుగా ఉద్యోగ అవకాశాలు లభించే అవకాశం ఉందని వివరించారు. సకల జనులు సుఖశాంతులతో శోభిల్లే తెలంగాణగా మార్చేందుకు ప్రజా ప్రభుత్వం పాలన అందిస్తుందని హామీ ఇస్తున్నానని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య విలువలను గౌరవిస్తూ... సంక్షేమానికి పెద్ద పీట వేస్తూ విశ్వ వేదికపై తెలంగాణను సగర్వంగా నిలిపే పాలనకు శక్తివంచన లేకుండా కృషి చేస్తామని హామీ ఇస్తున్నామని వ్యాఖ్యానించారు. అధికారంలోకి వచ్చిన 3నెలల్లోనే 30 వేల మందికి ఉద్యోగ నియామక పత్రాలు అందజేశామని సీఎం తెలిపారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ప్రక్షాళన చేసి, ఇప్పటికే గ్రూప్-1 ప్రాథమిక పరీక్షను విజయవంతంగా నిర్వహించామని రేవంత్ అన్నారు. 11,062 టీచర్ పోస్టుల భర్తీకి డీఎస్సీని విజయవంతంగా నిర్వహించామన్నారు. గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-3 నియామకాలకు ఉన్న కోర్టు చిక్కుముళ్లను పరిష్కరించామని, ఇటీవల శాసనసభలో జాబ్ క్యాలెండర్‌ను ప్రవేశ పెట్టామని తెలిపారు. సింగరేణి సహకారంతో రాజీవ్‌గాంధీ సివిల్స్ అభయ హస్తం కింద సివిల్స్‌లో ప్రాథమిక పరీక్షను విజయవంతంగా పూర్తి చేసిన అర్హులైన యువతకు రూ.లక్ష చొప్పున సాయం చేయాలని నిర్ణయించామని చెప్పారు. తమ ప్రభుత్వం అధికారాన్ని చేపట్టేనాటికి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ పూర్తిగా విధ్వంసమై ఉందని చెప్పారు. గత పదేళ్లలో రాష్ట్ర అప్పు 10 రెట్లు పెరిగిందని, రాష్ట్ర ఆవిర్భావ సమయంలో రూ.75,577 కోట్లుగా ఉన్న అప్పు... నిరుడు డిసెంబరు నాటికి రూ.7 లక్షల కోట్లకు చేరిందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీ చేసిందని, రాష్ట్రంలోని రైతాంగం ప్రస్తుతం అతి పెద్ద పండుగ జరుపుకుంటోందని రేవంత్ అన్నారు. రుణమాఫీకి ముందు మాఫీ అసాధ్యమంటూ వక్రభాష్యాలు చెప్పిన విపక్షాలు, ఇప్పుడేమో రంధ్రాన్వేషణ మొదలుపెట్టారని ఎద్దేవా చేశారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన రోజే... తెలంగాణ రైతుకు ఆర్థిక స్వాతంత్ర్యం వచ్చిందని ఘనంగా చెప్పుకునే రోజు ఇది అని, ఫలితంగా తన జన్మ ధన్యమైందని చెప్పారు.

# హామీలు నెరవేర్చకపోతే కాంగ్రెస్‌కు చుక్కలే..!

(మొదటి పేజీ తరువాయి..)

ఎద్దేవా చేశారు. తమది కుటుంబ పాలన అని విమర్శించారని... ఇప్పుడు ఎక్కడ చూసినా రేవంత్ రెడ్డి సోదరులే కనిపిస్తున్నారని దుయ్యబట్టారు. నోటిఫికేషన్లు ఇవ్వకుండానే 30 వేల ఉద్యోగాలు ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం జాబ్ లెస్ క్యాలెండర్ విడుదల చేసిందని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన 420 హామీలను నెరవేర్చకపోతే ప్రభుత్వాన్ని ఎండగడతామని కేటీఆర్ హెచ్చరించారు. రేవంత్ బావమరిది కంపెనీకి రూ. 1,000 కోట్ల టెండర్ ఇచ్చారని ఆరోపించారు. మాయ మాటలతో ప్రభుత్వాన్ని ఎక్కువ రోజులు నడపలేరని చెప్పారు. కడియం కావ్యను, కడియం శ్రీహరిని ప్రజలు త్వరలోనే నిలదీస్తారని అన్నారు.బీజేపీతో చీకటి ఒప్పందాలు చేసుకోవాల్సిన ఖర్మ తమకు లేదని కేటీఆర్ చెప్పారు. బీజేపీతో తమకు ఒప్పందాలు ఉంటే కవిత ఇన్ని రోజులు జైల్లో ఉంటుందా? అని ప్రశ్నించారు. హామీలను నెరవేర్చకపోతే కాంగ్రెస్ వీపు చింతపండు చేస్తామని అన్నారు. మోసం చేయడం కాంగ్రెస్ నైజమని... బీసీ రిజర్వేషన్లను పెంచకుండానే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్తారని విమర్శించారు.

# మీ రుణమాఫీ పచ్చి అబద్ధం!

**హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)-ఆగస్ట్ 15:** మీ రుణమాఫీ పచ్చి అబద్ధమని తెలిశాక రాజీనామా చేయాల్సింది ఎవరు? రేవంత్ రెడ్డి ఏ దేవుళ్ల మీద ఒట్టుపెట్టి మాట తప్పారో ఆ దేవుళ్ల వద్దకు వెళతాను. ఆయన చేసిన తప్పు తెలంగాణ ప్రజలకు ముప్పుగా మారవద్దని ప్రార్థిస్తాన'ని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. తాము రుణమాఫీ చేశామని, హామీని నిలబెట్టుకున్నందుకు హరీశ్ రావుకు సిగ్గుంటే రాజీనామా చేయాలని రేవంత్ రెడ్డి తన ఖమ్మం పర్యటనలో అన్నారు. ఈ వ్యాఖ్యలపై హరీశ్ రావు స్పందించారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా కౌంటర్ ఇచ్చారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి స్థాయికి తగ్గట్టు ప్రవర్తించడం లేదని విమర్శించారు. ఈ విషయాన్ని ప్రతి సందర్భంలోనూ నిరూపించుకుంటున్నాడని ఎద్దేవా చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చరిత్రలో గాని, తెలంగాణ చరిత్రలో గాని ఇంతగా దిగజారిన దిక్కుమాలిన ముఖ్యమంత్రి ఇంకెవరూ లేరని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అబద్దం కూడా సిగ్గుపడి మూసిలోకి దూకి ఆత్మహత్య చేసుకునేలా రేవంత్ రెడ్డి ప్రవర్తన ఉందన్నారు. దేవుళ్ల మీద ఒట్లు పెట్టుకొని కూడా మాట మీద నిలబడక పోగా, నిస్సిగ్గుగా బిఆర్ ఎస్ మీద, తన మీద అవాకులు చెవాకులు పేలాడని మండిపడ్డారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు సోనియాగాంధీ పుట్టిన రోజు కానుకగా డిసెంబర్ 9 నాటికి 40 వేల కోట్ల రూపాయల రైతు రుణమాఫీ ఏకకాలంలో చేస్తానని చెప్పింది ముఖ్యమంత్రే అన్నారు. అది నెరవేర్చలేక పార్లమెంట్ ఎన్నికల ముందు మరో నాటకానికి తెరలేపాడన్నారు. ఆగస్ట్ 15 తేదీ వరకు 31 వేల కోట్లు మాఫీ చేస్తానని ఎన్నికలలో ఊదరగొట్టాడని గుర్తు చేశారు. అంటే 9 వేల కోట్లు కోత పెట్టాడన్నారు. అయినప్పటికీ ఎవరూ నమ్మడం లేదని దేవుళ్ల మీద ఒట్లు పెట్టాడని విమర్శించారు. సోనియా మీద ఒట్టు పెట్టినా, దేవుళ్ల మీద ఒట్టు పెట్టినా అబద్దమే రేవంత్ రెడ్డి లక్షణమని... మోసమే ఆయన విధానమని వ్యాఖ్యానించారు. 'మాట తప్పడమే నా నైజం అనే విధంగా నగ్నంగా తన నిజస్వరూపాన్ని బట్టబయలు చేసుకున్నాడ'ని దుయ్యబట్టారు. బీఆర్ఎస్ హయాంలో మొదటి దఫాలో 35 లక్షల మంది రైతులకు లక్ష రూపాయల చొప్పున రుణమాఫీ చేస్తేనే దాదాపు 17వేల కోట్లు అయిందని గుర్తు చేశారు.

# మహనీయుల త్యాగాల ఫలితమే.. నేటి స్వేచ్ఛ వాయువు

- తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి
- జాతీయ జెండాను ఆవిష్కరించిన సీఎం
- గోల్కొండ కోటలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)-ఆగస్ట్ 15:** వరంగల్ డిక్లరేషన్ అమలులో భాగంగా తాము ఇప్పటికే రుణమాఫీ చేస్తున్నామని, త్వరలో రైతు భరోసా పథకాన్ని కూడా ప్రారంభిస్తామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. రుణమాఫీ సాధ్యం కాదని కొంతమంది వక్రభాష్యం చెప్పారని, కానీ తాము అమలు చేసి చూపించామన్నారు. రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేసి చూపిస్తున్నామన్నారు. ఈ ఏడాది నుంచి ఫసల్‌బీమాలో చేరాలని నిర్ణయించామన్నారు. గోల్కొండ కోటలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో సీఎం రేవంత్ రెడ్డి జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నేటి స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలు ఎందరో మహనీయుల త్యాగఫలమని ముఖ్యమంత్రి అన్నారు. అందెశ్రీ రాసిన గీతాన్ని తాము రాష్ట్ర గీతంగా ప్రకటించామని గుర్తు చేశారు. తమ సిద్ధాంతం గాంధేయవాదమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే నాటికి రూ.7 లక్షల కోట్ల అప్పులు ఉన్నాయని, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను దారుణంగా దెబ్బతీశారని ఆరోపించారు. పదేళ్లలోనే తెలంగాణ అప్పు పది రెట్లు పెరిగిందన్నారు. ఆర్థిక పరిస్థితిని మెరుగుపర్చేందుకు తాము కృషి చేస్తున్నామన్నారు. తమ అమెరికా పర్యటనలో ప్రపంచబ్యాంకు అధ్యక్షుడితో సమావేశమయ్యామన్నారు.

## సీతారామ ప్రాజెక్ట్ పంప్‌హౌస్‌ను ప్రారంభించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**భద్రాద్రి కొత్తగూడెం, (నేటి ఫోకస్‌న్యూస్)-ఆగస్ట్ 15:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పూసుగూడెంలో సీతారామ ప్రాజెక్టు రెండో పంప్ హౌస్‌ను ప్రారంభించారు. ఆ తర్వాత ఈ ప్రాజెక్టు పైలాన్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లాకు చెందిన మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటితో పాటు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

### నా కల నెరవేరింది: తుమ్మల

సీతారామ ప్రాజెక్టు ప్రారంభోత్సవంతో తన రాజకీయ కల నెరవేరిందని మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. ఈ ప్రాజెక్టు కోసం నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.8 వేల కోట్లు ఖర్చు చేసిందన్నారు. పంప్ హౌజ్ మోటర్లు పాడవకుండా ఉండేందుకు తమ ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల బిజీ షెడ్యూల్‌లోను ముఖ్యమంత్రి ఈ ప్రాజెక్టు ప్రారంభోత్సవం కోసం వచ్చారన్నారు. రైతు రుణమాఫీ చేస్తానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భద్రాద్రి రాములవారి పాదాల వద్ద ప్రకటన చేశారన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ఆగస్ట్ 15 వరకు రూ.2 లక్షల రుణమాఫీ చేసి ఇవాళ సగర్వంగా వైరా సభ నిర్వహిస్తున్నామన్నారు. నాగార్జున సాగర్ నీళ్ళు రాని పక్షంలో గోదావరి జలాలతో సాగర్ ఆయకట్టుకు నీరు అందిస్తామని హామీ ఇచ్చారు. తక్కువ సమయంలో 70 రోజుల్లో వైరా లింక్ కెనాల్ పూర్తి చేశామన్నారు. తమ ప్రభుత్వం నీరు అందించి సాగుకు దన్నుగా నిలుస్తోందన్నారు. అలాగే రుణమాఫీ చేసి రైతన్నల పక్షమని నిరూపించుకున్నామన్నారు. మిగిలిన సీతారామ ప్రాజెక్ట్ డిస్ట్రిబ్యూటరీ కెనాల్ పనులు సకాలంలో పూర్తి చేస్తామన్నారు.

# దేశానికి లౌకిక పౌరస్మృతి అవసరం

(మొదటి పేజీ తరువాయి..)

తలపాగా, తెల్ల కుర్తా, చుడీదార్‌తో మోదీ కనిపించారు. తన ప్రసంగంలో ఆయన వికసిత భారత్ భావనను మరింత ప్రస్ఫుటంగా ఆవిష్కరించారు. బంగ్లాదేశ్‌లో హిందువుల రక్షణ, దేశంలో మహిళలపై పెరిగిన అఘాయిత్యాల నుంచి ఒక దేశం- ఒకే ఎన్నికలు, సెబీ చైర్మన్- అదానీ వివాదంలో విపక్షాల తీరు, ప్రపంచ మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్‌ను నిలపడం వరకు అనేక అంశాలను తన ప్రసంగంలో ఆయన ప్రస్తావించారు. ప్రధానిగా ఎర్రకోట బురుజు నుంచి ఆయన ప్రసంగించడం ఇది 11వ సారి. 98 నిమిషాల పాటు సుదీర్ఘంగా ప్రసంగించి.. రికార్డు సృష్టించారు. స్వాతంత్ర్యానంతర భారతదేశంలో 2016లో అత్యధిక సమయం ప్రసంగించిన తన రికార్డును (94 నిమిషాలు) తానే బద్దలుకొట్టడం విశేషం. దాదాపు ఆరువేలమంది పాల్గొన్న ఈ కార్యక్రమానికి ఈసారి ఒలింపిక్ పతక విజేతలను ప్రత్యేకంగా ఆహ్వానించారు. వారికి కేటాయించిన సీట్ల వరుసలో, వారితోపాటు ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ కూర్చున్నారు. ఆ తర్వాతి వరుసలను కాంగ్రెస్ పార్టీ ఎంపీలకు కేటాయించారు. ప్రధానమంత్రి తన ప్రసంగంలో సుప్రీంకోర్టు ఇప్పటికే ఆదేశాలు ఇచ్చిన సివిల్ కోడ్ అంశాన్ని ప్రస్తావించారు. "మన సమాజం లోని ఒక పెద్ద సమూహం ఇప్పటి సివిల్ కోడ్ మతపరంగా ఉన్నదని నమ్ముతోంది. అది నిజం కూడా. ఈ కోడ్ వివక్షాపూరితమైంది. అది మత ప్రాతిపదికన దేశాన్ని ముక్కలు చేసి, అసమానత్వాన్ని ప్రోత్సహిస్తుంది. ఇప్పుడు మనమంతా సెక్యుల ర్ సివిల్ కోడ్‌కు మారాలి. ఇది ఇప్పటి అవసరం. రాజ్యాంగ స్ఫూర్తి కూడా ఇదే. ఇదే విషయాన్ని సుప్రీంకోర్టు పలుమార్లు నొక్కిచెప్పింది. ఈ విషయంలో రాజ్యాంగ నిర్మాతల స్వప్నాన్ని సాకారం చేసి తీరాలి" అని ప్రధాని స్పష్టం చేశారు. బంగ్లాదేశ్‌లోని హిందువులు, ఇతర మైనారిటీల రక్షణ విషయంలో 140 కోట్లమంది భారతీయులు కలత చెందుతున్నారని అన్నారు. పొరుగుదేశంలో పరిస్థితులు త్వరలోనే కుదురుకుంటాయన్న ఆశాభావాన్ని వెలిబుచ్చారు. కోల్‌కోతాలో మహి ళా వైద్యురాలిపై హత్యాచారం ఘటనను ప్రధాని పరోక్షంగా ప్రస్తావించారు. "ప్రతిరంగంలో మహిళలు దూ సుకుపోతున్నారు. కానీ, వారిపై జరుగుతున్న దాడుల ఘటనలు బాధిస్తున్నాయి. మహిళలకు భరోసా ఇచ్చే చర్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టాలి. వేగంగా దర్యాప్తు జరిపించడం వల్ల ప్రజల్లో నమ్మకం కలిగించగలుగుతాం" అని ఆయన అభిప్రాయపడ్డారు. 2047 నాటికి 'వికసిత్ భారత్‌ను ఆవిష్కరిస్తామని, ప్రపంచ మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించి తీరుతామని మోదీ పునరుద్ఘాటించారు. రాజకీయాల నుంచి కులతత్వం, బంధుప్రీతిని పారదోలాలని, యు వతే రాజకీయాలను మార్చాలని అన్నారు. దీనికోసం రాజకీయ కుటుంబాలకు చెందని కనీసం లక్ష మంది యువత ప్రజాజీవితంలోకి రావడానికి సిద్ధపడాలని పిలుపునిచ్చారు. వైద్యవిద్య కోసం రూ.లక్షలు, రూ.కోట్లు ఖర్చుపెట్టి విదేశాలకు విద్యార్థులు ఏటా వెళుతుండటాన్ని మోదీ ప్రస్తావిస్తూ... ఎక్కడికో వెళ్లి చదువుకోవాల్సిన పరిస్థితిని తప్పించడానికి వచ్చే ఐదేళ్లలో కొత్తగా 75 వేల మెడికల్ సీట్లను అందుబాటులోకి తేనున్నామని ఆయన తెలిపారు. భారతదేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ 1954లో ఎర్రకోట బురుజు నుంచి తన స్వాతంత్ర్య దినోత్సవ సందేశాన్ని 14 నిమిషాల్లో ముగించారు. ఆయన కుమార్తె, మాజీ ప్రధాని ఇందిరాగాంధీ 1966లో అంతే సమయం ప్రసంగించారు. గత ప్రధానుల్లో వీరిద్దరివే పొట్టి ప్రసంగాలు.. ఇక వాజ్‌పేయి 2002లో 25 నిమిషాలు, 2003లో 30 నిమిషాల్లో ప్రసంగం ముగించేయగా, ఆ మరుసటి ఏడాదే ప్రధాని అయి పదేళ్లు ఆ పదవిలో ఉన్న మన్మోహన్ సింగ్ 2012, 2013లో వరుసగా 32, 35 నిమిషాలు ప్రసంగించారు. ఆ తర్వాత ప్రధానమంత్రి అయిన నరేంద్ర మోదీ ఇప్పటికి 11సార్లు స్వాతంత్ర్య దినోత్సవ సందేశం ఇవ్వగా, అవన్నీ పెద్ద ప్రసంగాలే. అందులో 2017లో ఆయన అతి తక్కువగా 56 నిమిషాలు ప్రసంగించారు. ఇక ఐకే గుజ్రాల్ 1997లో 71 నిమిషాలు ప్రసంగించారు. బీజేపీ మేనిఫెస్టోలో యూనిఫామ్ సివిల్ కోడ్‌తోపాటు 'ఒక దేశం- ఒకే ఎన్నికలు' అనేదీ ముఖ్య[illegible] ఈ ప్రతిపాదన సాధ్యాసాధ్యాల పరిశీలనకు గత ఏడాది లా కమిషన్ ఏర్పడింది. మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలోని ఈ కమిటీ రాజకీయ పార్టీలను సంప్రదించి తయారుచేసిన నివేదికను కేంద్ర ప్రభుత్వానికి సమర్పించింది. ఈ ప్రతిపాదనను ఎక్కువ పార్టీలు వ్యతిరేకించడాన్ని మోదీ ప్రస్తావిస్తూ.. అభివృద్ధిని చూసి ఓర్వలేని వారిని, దేశ సంక్షేమం పట్టనివారని ప్రజలు తిరస్కరించాలని పిలుపునిచ్చారు. ఇలాంటి వారిని అనుమతిస్తే ప్రతిదాన్నీ ధ్వంసం చేసేస్తారని వ్యాఖ్యానిం చారు. సెబీ చైర్‌పర్సన్-అదానీ వ్యవహారంపై హిండెన్‌బర్గ్ నివేదికను పరోక్షంగా మోదీ ప్రస్తావి స్తూ.. భారత్‌కు వ్యతిరేకంగా జరుగుతున్న కుట్రల్లో విదేశీ శక్తులు భాగస్వాములు కావొద్దని హితవు పలికారు.

### యూనిఫామ్ సివిల్ కోడ్ ఆవశ్యకత ఉంది

**న్యూఢిల్లీ, (నేటి ఫోకస్‌న్యూస్)-ఆగస్ట్ 15:** ఎర్రకోట మీదుగా ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన ప్రసంగంలో యునిఫామ్ సివిల్ కోడ్ గురించి ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఈ కోడ్‌ని తీసుకురావాల్సిన సమయం వచ్చిందని స్పష్టం చేశారు. దేశాన్ని విభజించే చట్టాలకు కాలం చెల్లిందని, అలాంటి వాటిని పక్కన పెట్టేయాల్సి అవసరముందని తేల్చి చెప్పారు. యూసిసి విషయంలో సుప్రీంకోర్టు కూడా సానుకూలంగా ఉందని, త్వరలోనే ఈ కలను సాకారం చేసుకుంటామని అన్నారు. దేశ ప్రజలంతా ముందుకు వచ్చి యునిఫామ్ సివిల్ కోడ్‌పై తమ అభిప్రాయాలు చెప్పాలని సూచించారు ప్రధాని మోదీ. సెక్యులర్ కోడ్‌ని తీసుకొస్తే తప్ప మతపరమైన వివక్ష పోదని అభిప్రాయపడ్డారు. 'యునిఫామ్ సివిల్ కోడ్‌పై సుప్రీంకోర్టు ఎన్నోసార్లు చర్చలు జరిపింది. దేశంలో మెజార్టీ ప్రజలు ఈ కోడ్‌కి మద్దతునిస్తున్నారు. అందుకే సుప్రీంకోర్టు కూడా సానుకూలంగానే స్పందించింది. ఇప్పుడున్న కోడ్ మతపరమైన వివక్షకు దారి తీస్తోంది. యునిఫామ్ సివిల్ కోడ్ తీసుకురావాలని రాజ్యాంగకర్తలూ కలలు కన్నారు. వాళ్ల కలల్ని నిజం చేయడం మా బాధ్యతగా భావిస్తున్నాం అని అన్నారు.

## ప్రధాని మోడీ మరో రికార్డు

**న్యూఢిల్లీ, (నేటి ఫోకస్‌న్యూస్)-ఆగస్ట్ 15:** దేశవ్యాప్తంగా ఘనంగా జెండా పండుగ జరిగింది. 78వ స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ఊరు-వాడా అన్ని చోట్లా జాతీయ పతాక ఆవిష్కరణ జరిగింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశ రాజధాని న్యూఢిల్లీలోని ఎర్రకోట వద్ద జెండా వందన కార్యక్రమం జరిగింది. జాతీయ పతావిష్కరణ అనంతరం వరుసగా 11వ సారి ఎర్రకోట వేదికగా మాట్లాడిన ప్రధాని మోదీ రికార్డు సృష్టించారు. ఏకంగా 98 నిమిషాల పాటు మాట్లాడి అత్యధిక సమయం స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగం చేసిన ప్రధానిగా నరేంద్ర మోదీ నిలిచారు. గురువారం సుధీర్ఘ ప్రసంగం చేయడంతో ఈ రికార్డు సొంతమైంది. దేశంలో నెలకొన్న అనేక సమస్యలను ప్రస్తావిస్తూ మోదీ ప్రసంగించారు. దీంతో ఆయన పేరిటే ఉన్న మునుపటి 94 రికార్డును ఆయన బద్దలు కొట్టారు. 2014 నుంచి 2024 వరకు ఎర్రకోటపై మోదీ ప్రసంగాల సమయం ఇలావుంటి. 2014 - 65 నిమిషాలు, 2015 - 85 నిమిషాలు, 2016 - 94 నిమిషాలు 2017 - 56 నిమిషాలు, 2018 - 83 నిమిషాలు, 2019 - 92 నిమిషాలు, 2020 - 86 నిమిషాలు 2021 - 88 నిమిషాలు, 2022 - 83 నిమిషాలు,. 2023 - 90 నిమిషాలు మాట్లాడారు. తాజాగా 96 నిముషాల పాటు ప్రసగించి తన రికార్డును తానే అధిగమించారు. ఇక ఇతర ప్రధానమంత్రుల ప్రసంగాల విషయానికి వస్తే.. మోదీ కంటే ముందు 1947లో జవహర్‌లాల్ నెహ్రూ 72 నిమిషాలు, 1997లో ఐకే గుజ్రాల్ 71 నిమిషాలపాటు సుదీర్ఘ ప్రసంగాలు చేశారు. ఇక తక్కువ సమయం ప్రసంగాల విషయానికి వస్తే జవహర్ లాల్ నెహ్రూ 1954, 1966లలో 14 నిమిషాలు మాత్రమే మాట్లాడారు. ఇక మాజీ ప్రధానులు మన్మోహన్ సింగ్, అటల్ బిహారీ వాజ్‌పేయి కూడా ఎర్రకోట నుంచి తక్కువ సమయం మాత్రమే ప్రసంగించారు. మన్మోహన్ సింగ్ 2012లో 32 నిమిషాలు, 2013లో 35 నిమిషాలు మాత్రమే మాట్లాడారు.







# యన్‌యస్‌పి క్యాంప్ గ్రౌండ్‌లో 100అడుగుల జాతీయ పతాకావిష్కరణ

- 15వేల మంది విద్యార్థులతో ఘనంగా 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

**మిర్యాలగూడ, ఆగస్టు 15 (నేటి ఫోకస్ న్యూస్)**



పట్టణంలోని యన్.యస్.పి క్యాంప్ గ్రౌండ్ నందు మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో దాదాపు 15వేల మంది విద్యార్థులతో కలిసి వంద అడుగుల జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి ఘనంగా 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నల్గొండ ఎం.పీ శ్రీ కుందూరు రఘువీర్ రెడ్డి, చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి, జాతీయ పతాక రూపకల్పి పింగళి వెంకయ్య మనువడు పింగళి నరసింహ, డి.సి.సి అధ్యక్షులు కేతావత్ శంకర్ నాయక్ పాల్గొన్నారు. నూతనంగా ఏర్పాటు చేసిన 100 అడుగుల జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ నేను నా మిర్యాలగూడ కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న నూతన స్వచ్ఛంధ కార్యక్రమం రైతన్నకు విద్యా నేతం కార్యక్రమాన్ని ప్రకటించారు. ఈ కార్యక్రమం ద్వారా మనకోసం రైతన్న తన జీవితాన్ని, తన కుటుంబాన్ని, తన భూమిని పండించే ప్రతి క్షణంలో తాను సవాళ్లను ఎదుర్కొంటూ జీవించటం తప్ప మరొక మార్గం లేదు. దేశానికి ఆహారం అందించే రైతన్న తన కడుపు నింపుకొనే పరిస్థితి ఉండడం లేదు, మన రైతులు, తమకు అవసరమైన డబ్బుల్ని ని కూడా అందుకోవడం కష్టమైపోతున్న పరిస్థితిలో ఉంటారు. ఇటువంటి పరిస్తితులో వాళ్ళ పిల్లల్ని దచదివించడం ఇంకా భారమైపోతుంది. పొలానికి పెట్టుబడి పెట్టలేక పిల్లల్ని చదివించ లేక అర కొర చదువులు చదివిపిస్తున్నారు. అలాంటి వారికి మనవంతుగా వారి పిల్లలకి విద్య, సాంకేతికతను అందించి, వారికి అవసరమైన వనరులను అందించడం ద్వారా వారు చేస్తున్న పనిలో సంతోషం పొందేలా చేయవచ్చు. ఈ జీవన మార్గంలో మనం వారికి సహాయం చేసేందుకు మన వంతు కృషి చేయాలి. రైతుల అభ్యున్నతి అనేది దేశభక్తి, సహనం సానుభూతితో నిండిన కర్తవ్యం. మనం కలిసి పోతే, ప్రతి రైతు తన పొలంలో సాధ్యమైన ఉత్తమ ఫలితాలను సాధించి, మన దేశం యొక్క పేరు ప్రతిష్టలను మరింత పెంచగలుగుతాడు ప్రపంచానికి ఆహరం అందించ గలుగుతాడు. అందుకని రైతుల పిల్లలికి మంచి నాణ్యమైన విద్యను అందించేందుకు రైస్ మిల్లర్స్ అసోసియేషన్ సంయుక్తంగా కలిసి మంచి స్కూల్ ప్రాంగణం నిర్మించి అందులో 6వ తరగతి నుండి 10వ తరగతి వరకు (ఇంగ్లీష్ మీడియం) కేవలం రైతుల పిల్లలకి మాత్రమే ప్రవేశం కల్పించి గురుకుల విద్యా పాఠశాలగా తెరవాలని ఒక గొప్ప ఆలోచన పురుడు పోసుకొంది. దీనికి ప్రభత్వ తోడ్పాటుతో ప్రభుత్వ ఉపాధ్యాయులను నియమింప చేసి నియోజక వర్గ రైతు పిల్లలకి విద్యా వ్యవస్థ భారం కాకుండా చెయ్యాలని ఇది భవిష్యత్తులో కళాశాలగా కూడా మార్చాలనే గొప్ప ఆలోచనతో ముందుకు వస్తున్నారు. ఇది 2026 వరకు ప్రారంబించడానికి ప్రయత్నం చేద్దాం ఈ విధంగానైనా దేశానికి వెన్నెముక ఐన రైతుకు మనవంతు సహాయం చేద్దాం వాళ్ళ పిల్లల భవిష్యత్తుకు బంగారు బాటలు వేద్దాం రైతు ఋణం కొంచెమైనా తీర్చుకుందాం అని అన్నారు. అలాగే మన మిర్యాలగూడ రోడ్డు ప్రమాధాలు అధికంగా జరిగి ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారు. ప్రమాధాలు జరిగే జంక్షన్స్ అన్నిటి గుర్తించి, మన ఆర్ అండ్ బి మంత్రి వర్యులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సహకారంతో 110 కోట్ల నిధులతో 4 ఫ్లైఓవర్స్ , ఒక అండర్ పాస్ మంజూర్ చేయించడం జరిగింది. త్వరలోనే వాటిని ప్రారంబించడం జరుగుతుంది. దామరచర్ల, అడవిదేవులపల్లి మండలాల్లో రైతులు సాగు నిరు అంధక ఎన్నో ఏళ్లుగా లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ ల కోసం ఎదురుచూస్తున్నారు. వారి కల నెరవేర్చేందుకు మన ఇరిగేషన్ మంత్రి వర్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డి సహకారంతో దాదాపు 490 కోట్ల నిధులతో నియోజకవర్గ వ్యాప్తంగా 5 లిఫ్ట్ లను మంజూర్ చేయడం జరిగింది. ఈ విషయాలు అన్నీ మీకు తెలిసినవే ఈ సంధర్భంగా మన అందరి తరుపున మన గౌరవ మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి కి మరియు కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము. అధే విధంగా శాంతి బధ్రతలను కాపాడేందుకు గంజాయి డ్రగ్స్ లాంటి మారక ద్రవ్యాల నియంత్రణ కోసం మన తెలంగాణ లో ఎక్కడా లేని విధంగా మన మిర్యాలగూడలో రాత్రి 10:30 నిమిషాల తర్వాత అన్నీ షాపులు మూసేవేసే విధంగా పోలీసు వారిచే స్పెషల్ డ్రైవ్ నిర్వహించడం జరుగుతుంది. ధినికి సహకరిస్తున్న వ్యాపారస్తులకు, పోలీసు వారికి ఈ సంధర్భంగా ధన్యవాధాలు తెలియజేస్తున్నాము. నా పదవి కాలం పూర్తయ్యే సరికి ప్రతీ సామాన్యుడికి మెరుగైన ఉచిత వైద్య సేవలు అందేలా ప్రభుత్వ హాస్పిటల్ నీ తీర్చిదిద్దాలని అని నిర్ణయించుకున్నాము ధానికోసమే నెలలో ఒకటి నుంచి రెండు సార్లు సంధార్శించడం జరుగుతుంధి. ప్రతీ పేద, మధ్య తరగతి పిల్లవాడికి మెరుగైన విద్యని అందించేలా, విధ్యార్ధులకు మౌలిక సాధుపాయలు అంధించేలా ప్రభుత్వ పాఠశాలలో, కళాశాలలో ఆకస్మిక సంధర్శనలు నిర్వహించడం జరుగుతుంది. మిర్యాలగూడ నియోజకవర్గంలో ప్రతీ ఎకరాకు సాగునీటిని అందించి ప్రతీ రైతు రాజులా తిరగాలి, ప్రతీ గింజకు గిట్టుబాటు ధర అందించాలి అని కంకణం కట్టుకున్నాము. మన మిర్యాలగూడ పారిశ్రామికంగా అభివృద్ధిచెంది, ఎన్నో వేల కుటుంబాలకు ఉపాధి కల్పిస్తున్నాయి. దేశంలో నే ప్రథమ స్థానాల్లో ఉన్న కాలుష్య నియంత్రణలో, పర్యావరణాన్ని కాపాడుకోవడంలో వెనక పడ్డాము అనే చెప్పుకోవాలి. త్వరలో ప్రారంభం అవబోతున్న యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ మనకి మంచి కీర్తిని అందరికీ ఉపాధిని కల్పిస్తున్నప్పటికి దాని ద్వారా ఉష్ణోగ్రతలు కూడా 2 నుంచి మూడు డిగ్రీలు పెరిగే అవకాశాలు ఉన్నాయి. కావున వీటన్నిటి ఎదురుకొంటూ మన భవిష్యత్తు తరాలకు కాలుష్య రహిత, పచ్చని - స్వచ్చనీ మిర్యాలగూడని అందించాలని చాలా బలంగా నిర్ణయించుకున్నాము. అంధులో బాగంగా నియోజకవర్గ వ్యాప్తంగా లక్ష మొక్కలు నాలాటాలి అని కంకణం కట్టుకున్నాము. పర్యావరణ కాలుష్యనికి మరో కారణం ప్లాస్టిక్, మనం ప్లాస్టిక్ వస్తువుల వాడకానికి పూర్తిగా అలవాటు పడిపోయాము ఒకేసారి వాటిని నియంత్రించడం కూడా సాధ్యం కాధు అంధుకే ముంధుగా ప్లాస్టిక్ కవర్ల వాడకాన్ని పూర్తిగా నియంత్రించాలని నిర్ణయించుకున్నాము. నా ఈ పదవి కాలం పూర్తయ్యే సరికి తెలంగాణ రాష్ట్రం మొత్తం మన మిర్యాలగూడ నియోజకవర్గం వైపు చూసేలా భవిషత్తు తరాలు నేను నా మిర్యాలగూడ అని గర్వంగా చెప్పుకునే విధంగా తీర్చిదిద్దాలి అని నిర్ణయించుకున్నాము. ఈ కార్యక్రమాలు కేవలం నేను ఒక్కడినే అనుకుంటే పూర్తి చేయలేను, దానికి మీ అందరికీ సహాయ సహకారాలు కావాలి రైస్ మిల్లర్స్, డాక్టర్స్, పారిశుధ్య కార్మికులు, సామాజిక సంస్థల వారు, కుల, మత, జాతి, పార్టీల విబేధాలు లేకుండా సకలజనులు అందరం కలసి ఐకమత్యంతో పనిచేస్తూ భవిషత్తు మిర్యాలగూడ నీ తీర్చిదిద్దూధాం. ఈ రాష్ట్రానికి, ఈ దేశానికి వినిపించేలా "నేను నా మిర్యాలగూడ" అని గర్వంగా చాటి చెప్పుధాం అని అన్నారు.



## కేటీఆర్ మీ నాన్న నేర్పిన సంస్కారం ఇదేనా?

- కేటీఆర్ మీ ఆడపడుచులంతా బ్రేక్ డాన్స్‌లు చేస్తున్నారా : మంత్రి సీతక్క

**ములుగు ఫోకస్ న్యూస్ ప్రతినిధి సైదులు ఆగస్టు 15:**

మహిళల పట్ల అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యే కేటీఆర్ పై మంత్రి సీతక్క తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలు బ్రేక్ డాన్స్ లు, రికార్డింగ్ డాన్స్ లు చేసుకోవచ్చు అని కేటీఆర్ అత్యంత జుగుప్సకరంగా మాట్లాడారని మండిపడ్డారు.మీ తండ్రి కేసీఆర్ మీకు నేర్పిన గౌరవం, సంస్కారం ఇదేనా అని ప్రశ్నించారు. మీ ఆడపడుచులు అంతా బ్రేక్ డాన్స్ లు చేస్తున్నారా అంటూ కేటీఆర్‌పై ఫైరయ్యారు. మహిళల పట్ల కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరమన్న సీతక్క.. భేషరతుగా కేటీఆర్ తెలంగాణ మహిళా లోకానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఆడవాళ్ళను కించపరిచే విధంగా బ్రేక్ డాన్సులు చేసుకోండి అనడం మీ బుర్రలో వున్న బురదకు నిదర్శనమని చెప్పారు. గత పది సంవత్సరాలు హైదరాబాద్ లో క్లబ్బులు, పబ్బులు, బ్రేక్ డాన్సులు ఎంకరేజ్ చేసిన చరిత్ర మీదంటూ సీతక్క విమర్శించారు. మహిళలు ఆర్థికంగా ఎదగాలని వారి కోసం తాము అనేక సంక్షేమ పథకాలను అమలుచేస్తున్నామని తెలిపారు మంత్రి సీతక్క. అందులో భాగంగా పేద మహిళలకు రవాణా భారాన్ని తగ్గించేందుకు ఉచిత బస్సు ప్రయాణాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. శ్రమజీవులు, శ్రామిక మహిళలు ప్రయాణ సమయంలో సమయం వృధా చేయకుండా ఏదోక పని చేసుకుంటే తప్పేంటి అని అన్నారు సీతక్క. అలాంటి వారిని బ్రేక్ డాన్స్ లు వేసుకోమనడం దుర్మార్గమని వెల్లడించారు. ప్రజలకు ఉపయోగపడే పథకాలు మీకు నచ్చవని.. మేము చేస్తే దాని మీద తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.

## జాతీయ జెండాపై గ్రామపంచాయతీ సెక్రటరీ నిర్వాహకం

**ఉమ్మడి మహబూబ్నగర్ ప్రతినిధి, (నేటి ఫోకస్‌న్యూస్)-ఆగస్టు15:**




జాతీయ జెండా అవమానం... అచ్చంపేట నియోజకవర్గం అమ్రాబాద్ మండలం బికే.లక్ష్మాపూర్ గ్రామపంచాయతీ ముందు స్వాతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా గురువారం నామక మాత్రంగా జెండా ఎగరవేసి చేతులు దులుపుకున్నారనే విమర్శలు గ్రామ సెక్రెటరీ పై వెల్లువెత్తుతున్నాయి. భారతదేశ వ్యాప్తంగా జాతీయ జెండాను ఎంతో పవిత్రంగా చూసుకుని విషయంలో ప్రతి ఒక్కరూ చాలా జాగ్రత్తలు తీసుకొని జెండా ఎగరేసి ముందు జెండా తీసి వరకు జాతీయ జెండాపై ప్రత్యేక దృష్టి పెడతారు. అలాంటిది లక్ష్మాపూర్ బి.కె గ్రామపంచాయతీలో సెక్రెటరీ నిర్వాహకం వల్ల గురువారం సాయంత్రం 6:30 దాటినప్పటికీ జాతీయ జెండాను అగౌరపరిచారని గ్రామస్తులు మండల ప్రజలు తీవ్రస్థాయిలో ఆరోపిస్తున్నారు. తనకేమీ పట్టనట్లుగా వివరించడంపై పలువురు మండిపడుతున్నారు. మువ్వలెన్నెల జెండా పై నిర్లక్ష్యంగా వ్యవహరించిన గ్రామ సెక్రెటరీ పై సంబంధిత జిల్లా ఉన్నతాధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరిస్తున్నారు. సాయంత్రం కురుస్తున్న వర్షానికి మహానుభావుల చిత్రపటాలు తడుస్తూ దర్శనమిచ్చాయి.



## కల్హేర్ మండల కేంద్రంలో ఘనంగా 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

**కల్హేర్ మండల ప్రతినిధి, నేటి ఫోకస్‌న్యూస్)-ఆగస్టు 15:**

సంగారెడ్డి జిల్లా కల్హేరు మండల కేంద్రంలో గురువారం స్వతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో శ్రీనివాస్ త్రివర్ణ జాతీయ పథకాన్ని ఆవిష్కరించారు. మరియు తహసిల్దార్ కార్యాలయంలో శివ శ్రీనివాస్ రెపరెపలాడే జాతీయ పతాకాన్ని ఎగరవేశారు. పోలీస్ స్టేషన్లో ఎస్సై బి. వెంకటేశం స్టాఫ్ సిబ్బంది కలిసి జాతీయ పథకాన్ని ఆవిష్కరించారు. అలాగే ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు పాఠశాల విద్యార్థులు, విద్యార్థినిలు ప్రభాత పేరుతో వాడవాడలో వీధి వీధి న తిరిగి జెండా వందన కార్యక్రమం నిర్వహించారు. అదేవిధంగా జిల్లా ప్రజా పరిషత్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు విద్యార్థులు, విద్యార్థినిలు జాతీయ పథకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు యువజన సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు. మహాత్ముల యొక్క గాంధీ మహాత్ముని యొక్క త్యాగఫలమే నేడు మనమంతా పండుగ జరుపుకొనుచున్నాము,వారి యొక్క ఆశయాల మేరకు మనమంతా కులాలకు మతాలకు భాషలకు అతీతంగా ఉండి ఎలాంటి తారతమ్యాలు లేకుండా ఒకే తాటిపై ఉండి మనం స్వతంత్రి యులుగా జీవించగలుగుతున్నాము. మహాత్ముల త్యాగఫలమే మనకు ఈ యొక్క స్వతంత్ర దినోత్సవ కార్యక్రమాలను జరుపుకుంటామని అధికారులు అన్నారు.

## స్వాతంత్ర దినోత్సవ వేడుకలు

**పెద్ద వంగర, ఫోకస్ న్యూస్ ప్రతినిధి సైదులు-ఆగస్టు 15:**

ఉప్పరగూడెం గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించినటువంటి 78వ స్వాతంత్ర వేడుకల్లో ముఖ్యఅతిథిగా పంచాయతీ కార్యదర్శి హేమలత పాల్గొని జెండా ఆవిష్కరణ చేశారు తదునానంతరం మాట్లాడుతూ అక్కడ గ్రామంలో అభివృద్ధి గురించి ముచ్చటించారు అలాగే ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఉన్నంత పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు ఆశా కార్యకర్తలు అంగన్ వాడి టీచర్లు గ్రామ సమైక్య సంఘం వారు ఫీల్డ్ అసిస్టెంట్ గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.







# ఘనంగా స్వాతంత్ర దినోత్సవ వేడుకలు

- ప్రధాన రహదారుల వెంట విద్యార్థుల ర్యాలీలు, ప్రదర్శనలు
- అచ్చంపేట పట్టణంలో భారీ జాతీయ జెండాతో ఊరేగింపు
- హాజరైన ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ
- ఆగస్టు 15న పండుగ వాతావరణం

**ఉమ్మడి మహబూబ్నగర్ ప్రతినిధి,(నేటి ఫోకస్‌న్యూస్)-చారకొండ వెంకటేష్ ఆగస్టు 15:**

78వ. స్వాతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా వ్యాప్తంగా ఆగస్టు 15న. పండుగ వాతావరణం నెలకొంది. గురువారం తెల్లవారుజామున ప్రధాన పట్టణాలతో పాటు గ్రామాలలో స్వాతంత్ర దినోత్సవ వేడుకలను కన్నుల పండుగ జరుపుకున్నారు. ఉదయాన్నే జాతీయ జెండా చేతపట్టుకుని ప్రధాన రహదారుల వెంట భారీ ర్యాలీ తీస్తూ వేడుకల్లో మునిగితేలారు. మరికొన్నిచోట్ల




భారతమాత, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, మహాత్మా గాంధీ వంటి ప్రదర్శనలు నిర్వహించారు. పలుచోట్ల అంబేద్కర్, మహాత్మా గాంధీ, పలువురు స్వాతంత్ర యోధుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అచ్చంపేట పట్టణంలోని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ ఆధ్వర్యంలో స్వాతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా పట్టణంలోని రెండు కిలోమీటర్ల పొడవున భారీ ర్యాలీ నిర్వహిస్తూ.. 1000 మీటర్ల మేర జాతీయ జెండా ప్రతి ఒక్కరూ చేతులతో పట్టుకొని ర్యాలీలో పాల్గొన్నారు. ఈ ర్యాలీ పట్టణ ప్రజలను మంత్రముగ్ధులను చేసింది. రోడ్డు మొత్తం జాతీయ జెండాలతో మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలో ఆయా శాఖలకు సంబంధించిన ఉన్నతాధికారులు జండా ఎగరవేశారు. స్వాతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పోలీస్ శాఖ ప్రత్యేక ఏర్పాటు చేశారు. ఇలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో చేయడం జరిగింది.



# నాగ్సాన్‌పల్లి విద్యార్థులకు ప్రథమ జిల్లాస్థాయి అవార్డులు

**మెదక్ ప్రతినిధి సిహెచ్ దయానంద రెడ్డి, (నేటి ఫోకస్ న్యూస్)-ఆగస్టు 15:**

పాపన్నపేట మండలం నాగ్సాన్ పల్లి గ్రామంలో చదువుతున్న ఉన్నత పాఠశాల నుండి ముగ్గురు విద్యార్థులు సంజన, యశ్వంత్, మరియు ప్రవీణ్ కుమార్ లు జిల్లాస్థాయిలో ఇంటింటి ఇన్నోవేటర్ ప్రదర్శనకు ఎంపిక కావడంతో, గురువారం మెదక్ జిల్లా కలెక్టరేట్ లో జరుగుతున్న 78వ స్వాతంత్ర్య వేడుకలలో జిల్లా కలెక్టర్,మెదక్ నియోజకవర్గ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ చేతుల మీదుగా ముగ్గురి విద్యార్థులకు ప్రశంసా పత్రం తో పాటు, క్యాష్ రివార్డ్ ను అందజేశారు. ఎంపికైన విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు రాంకిషన్ గైడ్ టీచర్ అశోక్ కుమార్,ఉపాధ్యాయులు ముగ్గురి విద్యార్థులకు అభినందనలు తెలిపారు. జిల్లాస్థాయి అవార్డుకు ఎంపిక కావడంతో తోటి విద్యార్థినీ విద్యార్థులు, గ్రామస్తులు ప్రత్యేక అభినందనలు తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు.



# ఘనంగా 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

**పెద్ద వంగర ఫోకస్ న్యూస్ ప్రతినిధి సైదులు ఆగస్టు 15**

ఉప్పరగూడెం ప్రాథమికోన్నత పాఠశాలలో 78వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. భారత స్వతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రతి ఒక్కరూ రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా ప్రజాస్వామ్య పరిరక్షణ ధ్యేయంగా ముందుకు సాగాలిని ప్రధానోపాధ్యాయులు శ్రీ ఎం విజయ వర్ధన్ రెడ్డి అన్నారు పథకావిష్కరణ జరిపి కార్యక్రమం ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా ఏఏపీసీ చైర్మన్ , డ్వాక్రా గ్రూప్ సి ఏ గార్లు, గ్రామ యువకులు మెరుగు సందీప్, భాస్కరాచారి, శివ మరియు కిరణ్ తదితరులు, పాఠశాల ఉపాధ్యాయులు వి బాబురావు, నరేందర్ రెడ్డి, అబ్దుల్ ఖదీర్, సతీష్ కుమార్, అంగన్వాడి రేణుక, గ్రామ కార్యదర్శి హేమలత పాల్గొన్నారు. ఇందులో భాగంగా పాఠశాల అభివృద్ధి కోసం దాతలు ముందుకు రావాలని, విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు రావాలని, విద్యార్థుల సంఖ్యను పెంచాలని ప్రధానోపాధ్యాయులు వివరించారు.



# అచ్చంపేట ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో రెపరెపలాడిన మువ్వెన్నెల జెండా

**ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా ప్రతినిధి (నేటి పోకస్ న్యూస్) ఆగస్టు 15:**

78వ. స్వాతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా ఆగస్టు 15వ. అచ్చంపేట పట్టణంలోని ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం సీనియర్ జర్నలిస్ట్ రాహుల్ జాతీయ జెండా ఎగరవేయడం జరిగింది. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్టు రాహుప్ మాట్లాడుతూ... భారతదేశానికి స్వాతంత్రం రావడానికి ఎంతో మంది అమరుల త్యాగాల ఫలితమే నేడు ప్రతి ఒక్కరూ సంతోషంగా ఉన్నారన్నారు. మహాత్మా గాంధీ, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, సుభాష్ చంద్రబోస్ లతోపాటు ఎంతోమంది అమరవీరులు దేశానికి స్వాతంత్రం రావడానికి కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు శ్రీనువాసులు, దుమోర్ల భాస్కర్, చారగొండ బాలకృష్ణయ్య, చందు నాయక్, బొంత ప్రకాష్, మంచేల లక్ష్మీపతి, రాములు, జహంగీర్, చారగొండ వెంకటేష్, సహజ నందన్, రాము, చందు, బాలీశ్వర్, జంగయ్య, నారాయణ, రమేష్ లతోపాటు మరి కొంతమంది జెండా కార్యక్రమంలో పాల్గొన్నారు.

# అమరుల స్తూపం వద్ద ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

**(ఫోకస్ న్యూస్ ప్రతినిధి )సిర్గాపూర్ అగస్ట్ :15**

సంగారెడ్డి జిల్లా సిర్గాపూర్ మండల పరిధిలోని ఫతేపూర్ చౌరస్తా వద్ద గురువారం ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు జరిగాయి. ఉద్యమకారుడు గుండు మోహన్ జెండా ఆవిష్కరించారు. అనంతరం ఆయన అమరవీరులకు నివాళులు అర్పించారు. అమరవీరుల పోరాట ఫలితంగానే స్వాతంత్రం ఏర్పడిందని అన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, గ్రామ ప్రజలు, యువకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.









# కన్నుల పండుగగా స్వాతంత్ర వేడుకలు

**ఉమ్మడి మహబూబ్నగర్ ప్రతినిధి, (నేటి ఫోకస్‌న్యూస్)-చారకొండ వెంకటేష్ ఆగస్టు 15:**

అచ్చంపేట పట్టణంలో శ్రీ సరస్వతీ శిశు మందిర్ పాఠశాలలో గురువారం 78వ. స్వాతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకోవడం జరిగిందని పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ మంతటి. క్రాంతికుమార్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అచ్చంపేట డాక్టర్ బంధం బాల్ నారాయణ హాజరై జాతీయ జెండా పతాక ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... భారతదేశానికి స్వాతంత్ర్యం రావడానికి ఎందరో



మహానుభావులు, జాతీయ నాయకులు తమ ప్రాణాలను ప్రాణంగా పెట్టి స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని మన దేశానికి స్వాతంత్ర్యం తెచ్చారన్నారు. ఆనాడు మహాత్మా గాంధీ అందరిని ఐక్యం చేసి న్యాయం, సత్యం, అహింస పాటిస్తూ స్వాతంత్రోద్యమానికి పునాది వేశారని కొనియాడారు. విద్యార్థులు చిన్నతనం నుండే మంచి చదువును అవలంబించుకొని ఒక లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకోలన్నారు. భారతదేశ సంస్కృతి, విలువలను, ఆచారాలను, సాంప్రదాయాలను, దేశభక్తిని పాటిస్తూ క్రమశిక్షణతో చదువుకోవాలని దర్భంగా విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆకుల వెంకటేష్, దానోజు నటరాజ్ లు విద్యార్థులకు ప్యాడ్లు, నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మిర్యాల సుధాకరయ్య, కేతేపల్లి వెంకటేష్, కోట భాస్కర్, పెద్ది ఉమరాణి, పలుస గోపాల్, పద్మ, నటరాజ్, ప్రిన్సిపాల్ ఇందిరమ్మ, వైస్ ప్రిన్సిపాల్ క్రాంతి కుమార్, ఆచార్య బృందం లావణ్య, స్వప్న, ఉదయ కుమారి, మాధవి, జ్యోతి, సరిత, ప్రణీత, గౌసియలతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.





# వాడ వాడన ఘనంగా జంపన్న జన్మదిన వేడుకలు

- గత నాలుగు దశాబ్దాలుగా ప్రజలకు ఎనలేని సేవలు అందిస్తున్న జంపన్న: రామారావు

**ఫోకస్ న్యూస్, సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఆగస్ట్ 15:**

గత నాలుగు దశాబ్దాలుగా కంటోన్మెంట్ నియోజకవర్గంలో బడుగు బలహీన వర్గాల ప్రజలకు ఎంతో సేవలు అందిస్తున్న, కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ నాయకుడు జంపన్న ప్రతాప్ జన్మదిన వేడుకలను నియోజకవర్గ వ్యాప్తంగా జంపన అభిమానులు ఘనంగా జరుపుకున్నారు. జెపి యువసేన సభ్యులు పవన్ వారి ఫ్రెండ్స్ తో కలిసి జంపన ప్రతాప్ నివాసంలో కేక్ కట్ చేసి, శాలువతో సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. సోషల్ వర్కర్ రామారావు జంపన ప్రతాప్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపి, సంజీవయ్య నగర్ కాలనీలో స్థానిక బస్తి మహిళలు, యువకుల సమక్షంలో జంపన్న ప్రతాప్ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో శ్యామ్ సుందర్ రెడ్డి, ఎండి ముస్తఫా, ఎండి ఫయాజ్, సంజీవయ్య నగర్ కాలనీ ప్రజలు మహేందర్, విక్కీ, భరత్, రాహుల్, చోటు, సత్యమ్మ, విజయ, బాలమణి, బస్తీ వాసులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొని, జంపన ప్రతాప్ జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.







# స్వతంత్ర కోసం ఎంతోమంది అమరులయ్యారు..

- మహనీయుల ఆశయాలను కొనసాగించాలి: ఎమ్మెల్యే శ్రీ గణేష్
- అంబేద్కర్ హాట్స్‌లో ఘనంగా స్వతంత్ర దినోత్సవ వేడుకలు

**ఫోకస్ న్యూస్, సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఆగస్ట్ 15:**

మొగులుల దగ్గర నుంచి బ్రిటిష్ వరకు వందల సంవత్సరాల కాలంలో స్వతంత్రం కోసం మహనీయుల చేసిన పోరాటం చిరస్మరణీయం అని, కంటోన్మెంట్ శాసనసభ్యులు శ్రీ గణేష్ అన్నారు. గురువారం నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలలో 78వ స్వతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా ఎమ్మెల్యే శ్రీ గణేష్ హాజరై జెండా ఆవిష్కరణ చేశారు. బోయిన్ పల్లి పెద్ద తోకటలోని ముప్పిడి మధుకర్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన జెండా వందనానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై జెండా ఆవిష్కరణ చేసి, జాతీయ గీతాన్ని ఆలపించారు. అంబేద్కర్ హట్స్ లో ఘనంగా స్వతంత్ర దినోత్సవ వేడుకలు. అంబేద్కర్ హాట్స్ అధ్యక్షుడు సాంబ అశోక్ ఆధ్వర్యంలో 78వ స్వతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. బస్తి ప్రజలతో కలిసి ఆయన జెండా ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో ముప్పిడి మధుకర్, అరుణ్ యాదవ్, అశోక్ కుమార్, హరి, వెంకట్ రాములు, సాయిధవ్, కనక సుందర్ సందీప్ అంజి బాలరాజ్ నాగరాజు యాదగిరి మల్లికార్జున్ భాస్కర్ కొమురయ్య, అంబేద్కర్ హాట్స్ ప్రజలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# ఇంటి వద్దనే ప్రసవం చేసిన జహీరాబాద్ 108సిబ్బంది

- 108 ఈఎంటి సంగమేశ్వర్ పైలెట్ శ్రీనివాస్ కాలనీవాసుల అభినందనలు

**నేటి ఫోకస్ న్యూస్ ప్రతినిధి మనీష్ కుమార్ (జహీరాబాద్ టౌన్)-ఆగస్ట్ 15:**

జహీరాబాద్ పట్టణంలోని గడ్డం గల్లి ఒకటో వార్డుకు చెందిన నందిని, భర్త ధనరాజ్, 20 సం॥ పురిటి నొప్పులతో బాధపడుతూ 108 కాల్ చేయగా తక్షణమే స్పందించిన 108 సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని పురిటి నొప్పులు ఎక్కువ కావడం గమనించిన 108 అంబులెన్స్ ఈఎంటి సంగమేశ్వర్ బేసిక్ లైఫ్ నియమము పాటించి చాకచకంగా గర్భిణీకి ప్రసవం చేశారు. గర్భిణికి రెండవ కాన్పు నందు మగ బిడ్డ జన్మనిచ్చింది. తల్లీ, బిడ్డ ఇద్దరూ ఆరోగ్యంగానే ఉన్నారు.చికిత్స నిమిత్తం జహీరాబాద్ ఏరియా హాస్పిటల్ తరలించారు.అత్యవసర సమయంలో స్పందించిన 108 సిబ్బంది డెలివరీ చేయడం వల్ల కాలనీవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఏరియా హాస్పిటల్ సిబ్బందికి ముఖ్యంగా 108 ఈఎంటి సంగమేశ్వర్ పైలట్ శ్రీనివాస్ ను అభినందించారు.





# కణితి మాంసంతో పట్టుబడ్డ ముగ్గురిపై కేసు నమోదు

**ఉమ్మడి మహబూబ్నగర్ ప్రతినిధి, (నేటి ఫోకస్ న్యూస్)-ఆగస్టు 15:**

అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ లోని అమ్రాబాద్ మండలం వంగురోనిపల్లి గ్రామ సమీప%శీ%లో విద్యుత్తు తీగలకు తగిలి ఈనెల 12 వ. తేదీన కణతి మృతి చెందడం పట్ల అటవీ శాఖ అధికారులకు ఆలస్యంగా వెలుగులోకి వచ్చిందన్నారు. ఇట్టి విషయంపై ఎవరన్న దానిపై భారతీయగా ఉంగరంపల్లి గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు పిల్లి సాయిలు, జక్క నరసింహారావు, కాడారి అంజయ్యలు మాంసంతో పట్టుబడడం జరిగిందని అమ్రాబాద్ అటవీ శాఖ అధికారులు తెలిపారు. ఇట్టి విషయంపై కేసు నమోదు చేసి ముగ్గురిని రిమాండ్ కు తరలించడం జరిగిందని ఎఫ్ ఆర్ ఓ ఖాజామైనుద్దీన్, ఎఫ్ బి ఓలు, అటవీశాఖ అధికారులు తెలిపారు.





# వైరాలో రుణమాఫీ సంబరాలు

**ఉమ్మడి మహబూబ్నగర్ ప్రతినిధి, (నేటి ఫోకస్ న్యూస్)-చారకొండ వెంకటేష్ ఆగస్టు 15:**

ఆగస్టు 15న స్వాతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా అదేవిధంగా రాష్ట్ర వ్యాప్తంగా ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ఖమ్మం జిల్లా వైరాలో మూడో విడత రైతు రుణమాఫీ సందర్భంగా అమ్రాబాద్ మండల కేంద్రంలోని కాంగ్రెస్ నాయకులు, రైతులు బానసంచ పేలుస్తు సంబరాలు నిర్వహించుకున్నారు. ఖమ్మం జిల్లాలోని వైరాలో రైతులకు మూడో విడత రుణ మాఫీ రూ.2లక్షలు చేసిన సందర్భంగా సీఎం, ఎమ్మెల్యే చిత్రప టాలకు పాలాభిషేకం చేశారు. ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ ఆదే శాల మేరకు గురువారం మండల కేంద్రంలోని సంబరాలు నిర్వహించుకోవడం జరిగిందని పార్టీ నాయకులు అన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు, మరి కొంతమంది సీనియర్ నాయకులు, పార్టీ కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

